




మాట్లాడుతున్న కలెక్టర్ టి.వినయ్‌కృష్ణారెడ్డి

పంట రుణాలు పంపిణీ చేయాలి

నిజామాబాద్, జూలై 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రుణాల పంపిణీలో నిర్దేశిత లక్ష్యాలను పూర్తిస్థాయిలో సాధించేందుకు అంకితభావంతో కృషి చేస్తూ ఆయా వర్గాల అభ్యున్నతికి బ్యాంకర్లు దోహదపడాలని కలెక్టర్ టి.వినయ్‌కృష్ణారెడ్డి సూచించారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో బ్యాంకర్లతో జిల్లా స్థాయి బ్యాంకర్ల సంప్రదింపుల కమిటీ, త్రైమాసిక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాకు వ్యవసాయమే ప్రధాన ఆధారంగా ఉన్నందున పంటల రుణాల పంపిణీకి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ఖరీఫ్, రబీ సీజన్‌లకు సంబంధించి కేటాయించిన లక్ష్యాలు, సాధించిన ప్రగతి, ప్రస్తుత వానా కాలం పంటలకు గాను రైతాంగానికి అందించాల్సిన పంట రుణాలు తదితర అంశాలపై బ్యాంకుల వారీగా కలెక్టర్ సమీక్షించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రుణ ప్రణాళికను విడుదల చేశారు. వ్యవసాయ, అనుబంధ, వ్యవసాయేతర అన్ని రంగాలకు కలిపి 17990.59 కోట్ల రుణాలు అందించాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఇందులో ప్రాధాన్యత రంగాలకు 13928.92 కోట్ల రుణ సదుపాయం కల్పించాలని వార్షిక ప్రణాళికలో పేర్కొన్నారు. పూర్తిస్థాయిలో పంట రుణాల లక్ష్యాన్ని సాధించేందుకు బ్యాంకర్లు చొరవ చూపాలన్నారు. రుణ పంపిణీ లక్ష్యాన్ని అధిగమించాలని బ్యాంకర్లను కోరారు. ఆయా రంగాల్లో పలు బ్యాంకులు లక్ష్యానికి అనుగుణంగా రుణాలు అందిస్తుండగా మరికొన్ని బ్యాంకులు వెనుకంజలో ఉండిపోతున్నాయని అన్నారు. క్రమం తప్పకుండా సమీక్ష జరుపుతూ వంద శాతం లక్ష్యాల సాధనకు కృషి చేయాలని సూచించారు. ముఖ్యంగా విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు వీలుగా అందుబాటులో ఉన్న రుణ వసతిపై అవగాహన కల్పిస్తూ ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థులకు విద్యారుణాలను అందించేందుకు చొరవ చూపాలన్నారు. అంతేకాకుండా వివిధ వర్గాల అభ్యున్నతి, ఆర్థిక ప్రగతి కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న కార్యక్రమాలు, పథకాల కింద బ్యాంకర్లు తోడ్పాటును అందించాలన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు బ్యాంకింగ్ సేవలను సమర్థవంతంగా అందించాలని తెలిపారు. వీధి వ్యాపారాలు నిర్వహించే వారికి సూక్ష్మరుణాలను త్వరితగతిన మంజూరు చేయాలని తద్వారా వారు వ్యాపార లావాదేవీలను నిర్వహించేందుకు ఆర్థిక తోడ్పాటును అందించినట్లు అవుతుందన్నారు. ఇందిర మహిళా శక్తి సంఘాలలో 20 సంవత్సరాలు పైబడిన వారికి బ్యాంకు ఖాతాలు తెరిచి అవసరమైన వారికి రుణాలు అందించాలని సూచించారు. ఐదుగురు అంతకంటే

మిగతా 8వ పేజీలో...



మొదట 'పరిషత్'కే సై..

మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు

- ఆ తర్వాతనే పంచాయతీ ఎన్నికలు
- 42శాతం బీసీ రిజర్వేషన్లపై ఆర్డినెన్స్ తర్వాత రిజర్వేషన్‌ల ఖరారు
- ఆగస్టు చివరిలోగా స్థానిక ఎన్నికలు పూర్తిచేసేందుకు ఏర్పాట్లు

నిజామాబాద్, జూలై 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బీసీలకు 42శాతం రిజర్వేషన్లను కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ఆర్డినెన్స్‌ను ఇచ్చేందుకు క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకోవడంతో స్థానిక సంస్థల ఎన్నికలపై స్పష్టత వచ్చింది. ఇటీవల హైకోర్టు సెప్టెంబర్‌లోగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో ప్రభుత్వం ఆగస్టు చివరిలోగా మండల పరిషత్, జిల్లా పరిషత్, పంచాయతీ ఎన్నికలను నిర్వహించేందుకు సన్నద్ధమవుతోంది. ఈ మేరకు జిల్లా యంత్రాంగం సైతం ఎన్నికల నిర్వహణపై ఏర్పాట్లు చేస్తున్నారు. 2019లో మండల పరిషత్, జిల్లా పరిషత్‌లకు ఎన్నికలు జరగగా, 2024 జూన్‌లో పాలకవర్గాల కాలపరిమితి ముగియడంతో అప్పటి నుంచి ప్రత్యేక అధికారుల పాలనలోనే మండల పరిషత్, జిల్లా పరిషత్ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. పాలక వర్గాలు లేకపోవడంతో మండల పరిషత్, జిల్లా పరిషత్‌ల పాలన సైతం అస్తవ్యస్తంగా ఉంటుంది. ఏడాదికి పైగా ప్రత్యేక అధికారుల పాలనలో కొనసాగుతున్న మండల పరిషత్, జిల్లా పరిషత్‌లకు త్వరలోనే ఎన్నికలు నిర్వహించే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే ఓటరు జాబితా రూపకల్పనపై శిక్షణ నిర్వహిస్తున్నారు. పరిషత్ ఎన్నికలతోపాటు పంచాయతీ ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేస్తుంది. ఓటర్ల తుది జాబితాను రూపకల్పన చేసేందుకు జిల్లా అధికారులకు ఈనెల 15న ఆన్‌లైన్ శిక్షణ ఇవ్వనున్నారు. డీపీవో తోపాటు జడ్పీ సీఈవో, ఎంపీడీవోలు, ఎంపీవోలకు, పంచాయతీ కార్యదర్శులకు ఈ శిక్షణలో భాగస్వామ్యం చేస్తున్నారు. 2019లో జరిగిన మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికల్లో జిల్లాలో 299 ఎంపీటీసీ స్థానాలు, 23 జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించగా ఈసారి ఎంపీటీసీ స్థానాలతో పాటు జడ్పీటీసీ స్థానాలు పెరగనున్న నేపథ్యంలో అధికారులు ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో 307 ఎంపీటీసీ స్థానాలు, 31 జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలపై కసరత్తు

మొదట పంచాయతీ ఎన్నికల తర్వాతనే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహిస్తారనే ప్రచారం జరిగిన నేపథ్యంలో ప్రస్తుతం ప్రభుత్వం మొదట పరిషత్ ఎన్నికలను నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కొత్తగా ఏర్పాటైన మండలాలు సాలూర, డొంకేశ్వర్, ఆలూర్, పోతంగల్ మండలాలకు కొత్తగా జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించడంతో పాటు కొత్తగా ఏర్పాటైన మండలాల్లో ఎంపీటీసీ స్థానాలకు సైతం ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో అత్యధికంగా డిచ్‌పల్లిలో 17ఎంపీటీసీ స్థానాలు ఉండగా, చందూర్, మోస్రా, ఏర్గట్లలో 5చొప్పున ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. కొత్తగా చందూర్‌లో 2ఎంపీటీసీ స్థానాలు, మోస్రాలో 2ఎంపీటీసీ స్థానాలు, మాక్లూర్, నందిపేట, డొంకేశ్వర్, సాలూర మండలానికి ఒకటి చొప్పున ఎంపీటీసీ స్థానాలను పెంచుతూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా కొత్త ఎంపీటీసీ స్థానాలు పెరిగాయి.

రిజర్వేషన్లపై రానున్న స్పష్టత

బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లతో ప్రత్యేక ఆర్డినెన్స్ ద్వారా స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో మరికొద్ది రోజుల్లో రిజర్వేషన్‌లపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. 2018 పంచాయతీరాజ్ చట్టం ప్రకారం స్థానిక ఎన్నికల్లో వరుసగా పదేళ్లపాటు ఒకే రిజర్వేషన్ అమలులో ఉండేలా గత బీఆర్ఎస్ ప్రభుత్వం చట్టం చేసినప్పటికి ప్రస్తుత ప్రభుత్వం చట్టంలో సవరణలో తీసుకువచ్చేందుకు గురువారం జరిగిన క్యాబినెట్ మీటింగ్‌లో ఆమోదం తెలిపారు. పంచాయతీ రాజ్ చట్టసవరణ ఆర్డినెన్స్‌ను గవర్నర్ విడుదల చేసిన వెంటనే పరిషత్‌తో పాటు సర్పంచ్ ఎన్నికలకు సంబంధించిన రిజర్వేషన్‌లను ఖరారు చేయనున్నారు. ఎంపీపీ, జడ్పీటీసీ ఎన్నికల్లో జిల్లా యూనిట్‌గా, జడ్పీ చైర్మన్ ఎన్నికల్లో రాష్ట్రం యూనిట్‌గా రిజర్వేషన్‌లను ఖరారు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇప్పటి వరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే ఆసక్తి ఉన్న ఆశావహులు రిజర్వేషన్‌లు ఏ విధంగా వస్తాయోనన్న సందిగ్ధతతో ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం త్వరలో రిజర్వేషన్‌లు ఖరారు చేయనుండడంతో వారిలో పోటీచేసే ఆశలు రేకెత్తిస్తున్నాయి.

ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికల నిర్వహణకు అధికారులు ఇప్పటికే ఏర్పాట్లు చేస్తున్నారు. మొదట పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తారనే ప్రచారం నేపథ్యంలో డీపీవో గోదాంలో ఇప్పటికే 2వేలకు పైగా బ్యాలెట్ బాక్సులను సిద్ధంగా ఉంచారు. రిటర్నింగ్ ఆఫీసర్లు, సహాయ రిటర్నింగ్ అధికారులకు ఇప్పటికే మొదటి విడత ఎన్నికల శిక్షణను పూర్తిచేశారు. ఎన్నికల కోసం ఇతర సిబ్బందితో పాటు అదనంగా సిబ్బందిని సమీకరించి వారికి సైతం శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆగస్టు నెలాఖరు నాటికి పరిషత్ ఎన్నికలను పూర్తిచేసి ఆ తర్వాత పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్న నేపథ్యంలో జిల్లా పరిషత్, పంచాయతీ అధికారులు ఈ మేరకు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

కస్తూర్బా పాఠశాలలో ప్రమాదకరంగా గుంత

- పాఠశాల ప్రాంగణంలో గతంలో మొరం తవ్వకాలు
- ఒకే గదిలో విద్యాభ్యాసం.. సౌకర్యాల కరువు
- పాఠశాలలో దోమల బెడద.. గదుల కొరత
- ఇక్కట్లు పడుతున్న విద్యార్థులు.. పట్టించుకోని అధికారులు

7

శిథిలావస్థలో జక్రాన్‌పల్లి ప్రాథమిక పశువైద్యశాల

- వర్షం పడితే పెచ్చులూడుతున్న భవనం పైకప్పు
- భయాందోళనలో సిబ్బంది
- పట్టించుకోని అధికారులు

7



సమావేశానికి హాజరైన పోలీసుఅధికారులు

నేరాల నియంత్రణకు కృషి చేయాలి

- సీపీ సాయిచైతన్య

సుభాష్‌నగర్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కాలానికి అనుగుణంగా వస్తున్న నూతన పద్ధతులను ఉపయోగిస్తూ పోలీసు స్టేషన్ల పరిధిలో జరుగుతున్నటువంటి నేరాల నియంత్రణకు కృషి చేయాలని పోలీసు కమిషనర్ సాయి చైతన్య అన్నారు. జిల్లా కేంద్రంలోని కమాండ్ కంట్రోల్ హాల్‌లో పోలీసు స్టేషన్ రైటర్ల శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసులలో కొత్తదనం తీసుకువచ్చి కేసుల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసు స్టేషన్‌లలో గల కేసుల పరిశోధనలో నాణ్యతను పెంచి ఎఫ్ఐఆర్ నుంచి చార్జ్‌షీట్ రిపోర్ట్ వరకు ఉండవల్సిన మెలకువలపై అవగాహన కల్పించారు. ఎఫ్ఐఆర్, పంచనామా, నేరస్థుల ఒప్పుగోలు పంచనామా, స్టేట్‌మెంట్ రికార్డుచేయు విధానంపై గోప్యత పాటించాలని తెలిపారు. నూతన చట్టాలపై అవగాహన కల్పించి జరిగినటువంటి నేరానికి నేరస్థలానికి జత చేయడం విషయాలను నూతన టెక్నాలజీని వాడుకునే విషయంలో ఏఏ పద్ధతులను వాడాలో తెలిపారు. పాత కేసుల యొక్క విచారణలో ఉన్నటువంటి విషయాలను తెలియపరిచి చార్జ్‌షీట్ రిపోర్ట్ కోర్టులో సమర్పించే వరకు ఫోరెన్సిక్ సైన్స్‌ను వాడుకునే విధివిధానాలను కోర్టులో వేసే చార్జ్‌షీట్ తయారు చేసే విధివిధానాలను తెలిపారు. ఈ శిక్షణ మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్టేషన్ రైటర్లు సంబంధిత పోలీస్‌స్టేషన్‌లకు వెళ్లిన తర్వాత సిబ్బందికి సంబంధిత అధికారికి శిక్షణలో నేర్చుకున్నది సవివరంగా తెలియజేయాలన్నారు. ఈ శిక్షణలో డీసీపీ అడ్మిన్ బస్వారెడ్డి, ట్రైనింగ్ సీటీసీ ఏసీపీ మస్తాన్ అలీ, ఐటీకోర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పోలీసు కమిషనర్

అంతర్గత రోడ్లు అధ్వానం



- నగరంలో గుంతలమయంగా రహదారులు
- ఇక్కట్లు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు
- రోడ్ల మరమ్మతులను చేపట్టాలంటున్న నగర వాసులు



నగరంలోని రోడ్లపై ఏర్పడిన గుంతలలో నిలిచిన వర్షపు నీరు

సుభాష్‌నగర్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. గజానికి ఒక గుంత ఏర్పడటంతో వాహనదారులకు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. నగరంలోని శివారు కాలనీలో పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. కొద్దిపాటి వర్షానికే రోడ్లన్నీ చెరువులుగా మారుతున్నాయి. అందులో నుంచి వాహనాలు వెళ్లాలంటే ఇబ్బందిగా మారింది. నగరంలోని అర్యనగర్, సాయినగర్, నాగారం, తదితర ప్రాంతాల్లో రోడ్లన్నీ గుంతలుగా మారాయి. వీటితో పాటు ప్రధాన రహదారులు సైతం గుంతలు ఏర్పడటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కోసం సంవత్సరాల క్రితం తవ్విన రోడ్లు అలాగే ఉన్నాయి. వాటిని బాగు చేసేది ఎప్పుడో నగర ప్రజలకు అంతుపట్టడం లేదు. ప్రజలు అధికారులకు, ప్రజాప్రతినిధులకు మొర పెట్టుకున్నా ఫలితం ఉండటం లేదు. నగర పాలక సంస్థ అధికారులకు ప్రైవేటు వెంచర్లపై ఉన్న శ్రద్ధ ప్రజలు రోజు తిరిగే రోడ్లపై ఉండటం లేదు. ప్రతీ సంవత్సరం కంటే ఈ సంవత్సరం రోడ్లన్నీ గుంతలుగా మారి నగర ప్రజలను ఇబ్బందులు పెడుతున్నాయి. చిన్నపాటి వర్షానికే రోడ్లపైకి మురికినీరు వచ్చి చేరుతోంది. మురికి నీరులోనే నడవాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. కొన్నిచోట్ల మోకాళ్లపైకి వచ్చేంత నీరు రోడ్లపై చేరడంతో పాదాచారులకు ఇబ్బందిగా మారింది. వాహనాలు నీటిలో చిక్కుకొని ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు నగర రోడ్లను బాగు చేయాలని వేడుకుంటున్నారు.

నగరంలో రాకపోకలకు ఇబ్బందిగా మారింది..

: శ్రీకాంత్, ఆర్యనగర్

నగరంలోని ఆర్యనగర్‌లో రోడ్లన్నీ గుంతలమయంగా మారాయి. గత కొన్ని సంవత్సరాల క్రితం వేసిన రోడ్లన్నీ గుంతలుగా మారడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. చిన్నపాటి వర్షానికే రోడ్లన్నీ చెరువులను తలపిస్తున్నాయి. ప్రజాప్రతినిధులకు, అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా రోడ్లను బాగు చేయాలి.



చిన్నపాటి వర్షానికే రోడ్లపైకి వరద..

: కార్తిక్, వినాయక్‌నగర్

చిన్నపాటి వర్షానికి రోడ్లన్నీ జలమయమవుతున్నాయి. రోడ్లమీద పాదాచారులు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంది. డ్రైనేజీ నీరు సైతం రోడ్లపై పారుతోంది. దీంతో దుర్గంధం వెదజల్లుతుంది. రోడ్లను బాగుచేసి డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి.



నగరంలో ఘనంగా బోనాలు



నగరంలో బోనాల ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

- పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ధన్‌పాల్

నిజామాబాద్ కల్చరల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఘనంగా బోనాల పండుగ నిర్వహించారు. పాడిపంటలు, సుఖసం తోషాలతో ఉండాలని వేడుకుంటూ నగరంలోని వినాయక్‌న గర్‌లో గల మహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం భక్తులు బోనాలు సమర్పించారు. ముఖ్య అతిథిగా అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పాల్గొని అమ్మవారికి బోనాన్ని అందించారు. ఎమ్మెల్యే బోనాన్ని నెత్తిన పెట్టుకొని భక్తులకు కలిసి బోనాల ఊరేగింపులో పాల్గొన్నారు. బోనాల ఊరేగింపులో దారిపొడవునా పోతరాజు విన్యాసాలు, డప్పు వాయిద్యాలు, భక్తిపాటలతో సంబురంగా జరిపారు. ఈ సందర్భంగా అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ.. ప్రతియేటా ఆషాఢమాసంలో అమ్మవారికి బోనాలను సమర్పించు కోవడం తెలంగాణ సంస్కృతి సంప్రదాయంలో ఉందని అన్నారు. కోరిన కోరికలు తీర్చే తల్లిగా, గ్రామ దేవతగా, మహాలక్ష్మిగా కొలువుదీరారని అన్నారు. గ్రామదేవతలను పూజించడం వల్ల గ్రామంలోకి ఎలాంటి దుష్టశక్తులు రావని తద్వారా మనమంతా ఆనందంగా జీవనాన్ని కొనసాగించుకునే విధంగా అమ్మ అనుగ్రహం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచరెడ్డి లావణ్య, లింగం, శీతల్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, రాజు, గంగాదర్, రాజు, ఆనంద్, బాస్కర్, సతీష్ పాల్గొన్నారు.



మహాలక్ష్మి అమ్మవారికి పూజలు చేస్తున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

ఇంకుడు గుంతలో పడి మూడేళ్ల బాలుడి మృతి

- మూడు చక్రాల సైకిల్‌పై ఆడుతూ గుంతలో పడిన బాలుడు

8



'గల్ఫ్ మృతుల కుటుంబాలకు అండగా ఉన్నాం'



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ తెలంగాణ గల్ఫ్ నాయకులు

కమ్మర్‌పల్లి, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : గల్ఫ్ మృతుల కుటుంబాలను తెలంగాణ ప్రభుత్వం ఆదుకుంటుందని కాంగ్రెస్ తెలంగాణ గల్ఫ్ విభాగము అధ్యక్షులు సింగిరెడ్డి నరేష్‌రెడ్డి అన్నారు. బాల్కొండ నియోజకవర్గం వారిగా వివిధ గ్రామాల్లో మృత్యువాత పడిన 165 మంది గల్ఫ్‌మృతుల కుటుం బాలను గుర్తించి వారికి రూ.5లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందజేసిం దని శుక్రవారం కమ్మర్‌పల్లి వచ్చిన సందర్భంగా మండల పార్టీ కార్యాలయంలో సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు సుంకెట రవి, మార్కెట్ కమిటీ సుంకెట బుచ్చన్న, కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు పడిగెల ప్రవీణ్, జైడి శ్రీనివాస్ తెడ్డు రమేష్, సల్లూరి గణేష్‌గౌడ్, ప్రదీప్, అజార్, రంజీత్ పాల్గొన్నారు.

'ఉపాధ్యాయులకు డ్యూటీ సర్టిఫికెట్ ఇవ్వండి'

కమ్మర్‌పల్లి, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలమేరకు మండలంలో నిర్వహించిన కుటుంబ ఆర్థిక సమగ్ర సర్వేలో పాల్గొన్న ఉపాధ్యాయులకు డ్యూటీ సర్టిఫికెట్లు ఇప్పిస్తు వేతనాల విడుదల చేయాలని కోరుతూ శుక్రవారం పీఆర్టీయూ నాయకులు కమ్మర్‌పల్లి తహసీల్దార్ జీ.ప్రసాద్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్, అంజద్ సుల్తాన్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు రాజేశ్వర్‌గౌడ్ పాల్గొన్నారు. కమ్మర్‌పలల్లి మండలం హాసాకొత్తూర్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు శ్రీనివాసమూర్తి ని పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా నియమిస్తు రాష్ట్ర శాఖ దేశా లు జారీ చేసిందని మండల బాధ్యులు చంద్రశేఖర్ తెలిపారు. కార్య క్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు రాజేశ్వర్‌గౌడ్, పాఠశాల ప్రధానో పాధ్యాయులు కృష్ణకుమార్, ఉపాధ్యాయులు షేక్ జాన్‌బాష, రాంపాల్, మాధురి, జయంతి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో వన మహోత్సవం

ముప్కాల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా వేంపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఎంఈవో రవికుమార్ శుక్రవారం మొక్కలు నాటి వన మహోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ కొరకు ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ రాకేష్ యాదవ్, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, రామకృష్ణ పాల్గొన్నారు.

వర్ని : వర్ని మండలం జాకోరా గ్రామంలో శుక్రవారం అధికారులు వన మహోత్సవం నిర్వహించారు. గ్రామంలో మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ రెండు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంపీవో మారుతి, కార్యదర్శి సాయిలు, అటవీ అధికారులు పాల్గొన్నారు.

డ్యూయల్ డెస్క్‌బెంచీల వితరణ

మోర్తాడ్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు చిట్టాపూర్ గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త ఏనుగు దయానంద రెడ్డి రూ.లక్షా 20 వేల విలువగల 25 డ్యూయల్ డెస్క్ బెంచీలను శుక్రవారం అందజేశారు. వీటిని పీడీ రాజ్‌కుమార్, న్యావనంద్ గణేష్, బి.శ్యామ్‌లు పాఠశాలకు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్ , ఉపాధ్యాయులు, విద్యార్థులు దయానంద్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అశోక్, రవీందర్, దీపిక, శకుంతల, అనిత పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ

ఆలూర్ , జున్11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రమేష్ ఆధ్వర్యంలో కల్యాణలక్ష్మీ చెక్కులు 20 మంది లబ్ధిదారులకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆలూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముక్కెర విజయ్ మాట్లాడుతూ రాష్ట్రంలో దళిత, గిరిజన, ఓబీసీ వర్గాలకు చెందిన కుటుంబాల యువతుల వివాహాల కోసం ఒక్కో లబ్ధిదారునికి రూ.లక్షా 116 ఆర్థిక సహాయం అందిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కల్యాణలక్ష్మి పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రేణుబాయి, కాంగ్రెస్ నాయకులు నీలగిరి శ్రీను, మహేష్, బీజేపీ నాయకులు మల్లయ్య, ప్రణయ్‌తేజ్, హరీష్, తదితరులు పాల్గొన్నారు.

నర్సరీ, ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన

ఆర్మూర్ రూరల్ , జున్11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పిప్రి గ్రామంలో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్లను ఎంపీడీవో శివాజీ పరిశీ లించారు. ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు వెంటనే తమ ఇంటి నిర్మాణాలను ప్రారంభించాలని సూచించారు. అనంతరం గ్రామంలోని నర్సరీని పరిశీలించారు. నర్సరీలో మొక్కల వివరాలను నిర్వహకులను అడిగి తెలుసుకున్నారు. వన మహోత్సవంలో భాగంగా ప్రతీ ఒక్కరు మొక్కలు నాటేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఫ్రై డే డ్రైడే కార్యక్రమాన్ని ఎంపీడీవో పరిశీలించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఆయన వెంట పంచాయితీ కార్యదర్శి మురళికాంత్ ఉన్నారు.

విద్యార్థులకు దుస్తువుల పంపిణీ

ఆర్మూర్ రూరల్ , జున్11 (ఆంధ్రజ్యోతి): . ఆర్మూర్ మున్సిపల్ పరిధి పెర్కిట్‌లోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందజేసిన ఏకరూప దుస్తువులు, పాఠ్య పుస్తకాలను విద్యార్థులకు పెర్కిట్ విడిసి అధ్యక్షుడు బిఎస్‌బి రాజు, మోహన్, నచ్చు గంగాధర్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ మున్ను, మాజీ కౌన్సిలర్ లిక్కి శంకర్, కోటార్మూర్ విడిసి సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అధ్యాపకులకు అభినందన

ఆర్మూర్ రూరల్, జున్11 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల అడ్మిషన్లు ఘణనీయంగా పెంచినందుకు గాను కళాశాల ప్రిన్సిపల్ ఎం. విజయానంద్‌రెడ్డి, అధ్యాపకులను ఇంటర్మీడియట్ ఉమ్మడి జిల్లా స్పెషల్ ఆఫీసర్ దాసరి ఒడ్డెన్న అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల గత ఫలితాలను విశ్లేషించారు. ప్రతీ రోజు కళాశాలకు విద్యార్థులు హాజరయ్యే విధంగా చూడాలని, విద్యార్థుల డ్రాప్‌ఔట్ సంఖ్యను తగ్గించాలని ఇంటర్ ఫలితాలలో అత్యధిక శాతం తీసుకురావాలని సూచించారు. కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. వన మహోత్సవంలో భాగంగా ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు చంద్రశేఖర్, నరేష్, శుభాష్, విజయలక్ష్మీ, గంగాధర్, లక్ష్మణ్, శ్రీనివాస్, చంద్రమోహన్, నిఖిత, రామకృష్ణ, కృష్ణమోహన్ పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ప్రత్యేకాధికారి దాసరి ఒడ్డెన్న

ఇందిరమ్మ ఇళ్ల పనులు వేగవంతం చేయాలి

● బోధన్ సబ్‌కలెక్టర్ వికాస్ మహతో

బోధన్‌రూరల్,జూలై11(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు నిర్మాణ పనులను వేగవంతం చేయాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. శుక్రవారం బోధన్ పట్టణంలోని 28, 23 వార్డులలో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుల సర్వేను నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం బేస్‌లెవెల్ మార్కింగ్ పూర్తయిన లబ్ధిదారుల ఖాతాలలో ప్రభుత్వం విడుదల చేసిన ఆర్థిక సహాయాన్ని అందజేశారా అని తెలుసుకున్నామన్నారు. వార్డుల వారీగా లబ్ధిదారులను వ్యక్తిగతంలో కలుసుకుని వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ప్రభుత్వం గృహ నిర్మాణ నిధులను దశలవారిగా విడుదల చేస్తుందని పేర్కొన్నారు. వార్డు అధికారులతో నిరంతరం సత్సంబంధంతో ఉండి పథకం మార్గదర్శకాల ప్రకారం ప్రయోజనాలను పొందాలని లబ్ధిదారులకు సూచించారు.

కోటగిరి : ఓటరు జాబితా తప్పుల తడకగా లేకుండా పడ్బందీ గా రూపొందించాలని బాన్సువాడ సబ్‌కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి కిరణ్మయి సూచించారు. పొతంగల్ మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం నేషనల్ ట్రైనింగ్ అండ్ ఆర్గనైజేషన్ ప్రోగ్రామ్ బూత్ లెవెల్ అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరైన మాట్లాడారు. పోలింగ్ రోజుకు ముందు పోలింగ్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఓటరు సమాచారం స్లిప్‌లకు ఇతరులకు ఇవ్వకుండా చూడాలని సూచించారు. ఎన్నికల నిర్వహణ నియామలపై బీఎల్‌వోలకు అవగాహన కల్పించారు. 18ఏళ్లు నిండిన ప్రతి పౌరుడు ఓటుహక్కు కోసం నమోదు చేసుకునేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గంగాధర్, ట్రైనింగ్ అధికారులు నరహరి, అశోక్, బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.



రైతువేదికలో మాట్లాడుతున్న బాన్సువాడ సబ్‌కలెక్టర్ కిరణ్మయి

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



నిల్వ నీటిని తొలగిస్తున్న దృశ్యం

భీమ్‌గల్ , జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కమిషనర్ గోపు గంగాధర్ తెలిపారు. శుక్రవారం డ్రైడే కార్యక్రమం సందర్భంగా పట్టణ ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించి నీరు నిలువ ఉన్న ప్రదేశాలలో ఆయిల్ బాల్స్‌ను వేశారు. ఈ సందర్భంగా ప్రస్తుతం వర్షాకాలం సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నందున ఇంటి పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. అలాగే తడి పొడి చెత్తను వేరువేరుగా వేయాలని సూచించారు. కార్యక్రమంలో మేనేజర్ నరేందర్, వార్డ్ ఆఫీసర్, మున్సిపల్ సిబ్బంది, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్మూర్ ఆర్టీసీ డిపో ఆకస్మిక తనిఖీ



ఆర్మూర్ డిపో సిబ్బందితో మాట్లాడుతున్న ఈడీ సాల్మాన్‌రాజ్

పెర్కిట్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని ఆర్టీసీ బస్ డిపోను శుక్రవారం కరీంగనర్ ఈడీ సాల్మాన్‌రాజ్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఆర్మూర్ డిపో, బస్టాండ్ ఆవరణను పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడుతూ సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ రవికుమార్, రీజనల్ మేనేజర్ జోష్న, అధికారులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి, సంరక్షించాలి

● వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముత్యంరెడ్డి



మొక్కలు నాటుతున్న ఏఎంసీ చైర్మన్ ముత్యంరెడ్డి

వేల్పూర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): జీవకోటి ప్రాణాలకు ప్రాణవాయువును అందించే మొక్కల ఆవశ్యకతను ఎవరి వారే గుర్తిస్తు మొక్కలు నాటాలని వేల్పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి అన్నారు. వనమహోత్సవంలో భాగంగా శుక్రవారం వేల్పూర్ క్రాస్‌రోడ్డు వద్ద 63వ జాతీయ రహదారి సమీపంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో ఏఎంసీ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవం కార్యక్రమంలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలన్నారు. పచ్చదనాన్ని పెంపొందిస్తు బావితరాలకు ఆహ్లాదకరమైన పర్యావరణం అందించాలన్నారు. మొక్కలవల్ల పర్యావరణ సమతుల్యాన్ని కాపాడడంతో పాటు పచ్చదనం పెరిగి సకాలంలో వర్షాలు కురుస్తాయన్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ ఉపాధ్యక్షుడు గడ్డం నర్సారెడ్డి, ఏఎంసీ కార్యదర్శి టి. మెర్సీ, జేఎంఎస్ మోసిన్, పాలకవర్గ సభ్యులు, ప్రజాప్రతినిదులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం

ఆర్మూర్ టౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మార్కెట్ యార్డులో కాంగ్రెస్ నాయకులు సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో బీసీ సెల్ పట్టణ అధ్యక్షుడు దొండి రమణ హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ షేక్‌మున్నా, ఎస్‌కే బబ్లు, రవికాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలి

బోధన్‌రూరల్,జూలై11(ఆంధ్రజ్యోతి): బోధన్ మండలంలోని బెల్లాల్ గ్రామ పంచాయతీ పరిధిలో శుక్రవారం ఎయిడ్స్‌పై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి గంగాధర్, సూపర్‌వైజర్ సుధారాణి, ఏఎన్‌ఎం సంధ్యరాణి, ఆశ వర్కర్లు రజిత, ఫీల్డ్ అసిస్టెంట్ రాజు, కారోబార్ లింగం, ఉమెన్స్ వరల్డ్ ఆర్గనైజేషన్ కమ్యూనిటీ కోఆర్డినేటర్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎస్సై రాజేశ్వర్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు

ఏర్గట్ల, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పోలీస్‌స్టేషన్‌లో ఇటీవలే బాధ్యతలు చేపట్టిన ఎస్సై పడాల రాజేశ్వర్‌ను శుక్రవారం మండలంలోని గుమ్మిర్యాల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు దేశబోయిన చిన్న సంజీవ్ నాయకులు పాల్గొన్నారు.



ఎస్సైని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు



వేల్పూర్ బీసీ హాస్టల్‌లో వంట సరుకులను పరిశీలిస్తున్న డాక్టర్ వీణ

వేల్పూర్, జూన్11 (ఆంధ్రజ్యోతి): వేల్పూర్‌లోని బీసీ వసతి గృహంలో శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వీణ విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వీణ మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతను పాటిస్తు పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే రోగాలు ధరిచేరవన్నారు. అంతకు ముందు వసతి గృహంలోని వంట గది, స్టోర్ రూంలను పరిశీలించారు. వండే పాత్రలు శుభ్రంగ ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ ఎస్తేరు, హెల్త్ అసిస్టెంట్ వేణుగోపాల్, ఏఎన్‌ఎం రాధిక, తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించాలి'



మోర్తాడ్‌లో కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న నాయకులు

మోర్తాడ్, జూన్11 (ఆంధ్రజ్యోతి): మోర్తాడ్‌లో బీజేపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న నరేష్‌కుమార్ స్థానిక సంస్థల ఎన్నికల్లో భారతీయ జనతాపార్టీ ఘన విజయం సాధించాలని, అందుకు కార్యకర్తలు నాయకులు కృషి చేయాలని బీజేపీ నాయకులు అన్నారు. శుక్రవారం మండల బీజేపీ శాఖ ఆధ్వర్యంలో కార్యకర్తల సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశంలో మండల బీజేపీ అధ్యక్షుడు శివానంద్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అనేక సంక్షేమ కార్యక్రమాలు, పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. త్వరలో జరుగనున్నా సంస్థాగత ఎన్నికల్లో పార్టీ విజయం సాధించేందుకు ప్రతీ కార్యకర్త క్రమశిక్షణతో కృషి చేయాలని కోరారు. సమావేశంలో బీజేపీ నాయకులు బోగ దేవేందర్, అనిల్, పోరం ప్రకాష్, జైడి గంగారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, తీగెల రమేష్‌రెడ్డి, లక్ష్మీనర్సయ్య, మురళిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మోర్తాడ్ కళాశాలను సందర్శించిన డీఐఈవో



లెక్చరర్‌తో మాట్లాడుతున్న డీఐఈవో ఒడ్డెన్న

మోర్తాడ్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను డీఐఈవో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా స్పెషల్ అధికారి దాసరి ఒడ్డెన్న, జిల్లా అకాడమిక్ మానిటర్ నర్సయ్య సందర్శించారు. ఈ సందర్భంగా లెక్చరర్‌లతో మాట్లాడుతూ కళాశాలలో అడ్మిషన్లు పెంచాలని, డ్రాప్‌అవుట్ తగ్గించాలని సూచించారు. విద్యార్థులను తమ సొంత పిల్లలుగా భావించి మంచి విద్యాబోధన బోధించాలని సూచించారు. అనంతరం వారు కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డి. గంగాధర్, లెక్చరర్లు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన

ఆర్మూర్ టౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అశోక్‌నగర్, అరుంధతినగర్ యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో మహిళలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా శుభ్రత పాటించాలని, ఇంటిలోకి దోమలు రాకుండా దోమ తెరలు వాడాలని, దోమల నివారణపై అవగాహన కల్పించారు. ప్రతీ శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహిస్తామని డెంగ్యూ వ్యాధి లక్షణాలను తెలిపి చికిత్సకు సంబంధించి విషయాలు తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ప్రదీప్, సబ్ యూనిట్ ఆఫీసర్ సాయి, హెల్త్ అసిస్టెంట్ ఆనంద్, ఏఎ న్‌ఎం రాజవ్వ, ఆశలు పద్మ, కవిత, సాగర్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం

ఏర్గట్ల, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన నవాబ్ ఇటీవలే అనారోగ్యంతో మృతిచెందగా శుక్రవారం బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్ ఆర్థిక సహాయం కింద 5వేలు, మునిమానిక్యం సునీల్ ఇటీవలే అనారోగ్యంతో మృతిచెందగా వారికి కుటుంబానికి 5వేలు ఆర్థిక సహాయాన్ని పంపంగా మండలంలోని కాంగ్రెస్ నాయకులు వారి కుటుంబాలకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్, గడ్డం జీవన్, పన్నాల నర్సారెడ్డి, రాజారం సహదేవ్, మేకల సాయన్న తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

ఏర్గట్ల, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని 8 మందికి 2లక్షల12500 ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు మంజూరీ కాగా అట్టి చెక్కులను శుక్రవారం కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో లబ్ధిదారులను నాయకుల చుట్టూ తిప్పుకోకుండా ప్రభుత్వం పథకాలను నేరుగా వారి ఇంటికే వెళ్లి అందజేశారని తెలిపారు. చెక్కుల మంజూరు కృషిచేసిన బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్‌కు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్, గడ్డం జీవన్, పన్నాల నర్సారెడ్డి, బద్దం లింగారెడ్డి, ముస్కు మోహన్, మేకల సాయన్న, మునిమానిక్యం అజయ్, సాయికుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.

నోట్‌బుక్‌లు, పెన్నుల పంపిణీ

వర్ని, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని వడ్డేపల్లి జడ్పీ హైస్కూల్ 2001-02 పదోతరగతికి చెందిన పూర్వవిద్యార్థులు శుక్రవారం నోట్‌బుక్‌లు, పెన్నులు అందజేశారు. పూర్వవిద్యార్థి బాణోత్ రమేష్, సైనిక ఉద్యోగ విద్యార్థి వడ్ల భాస్కర్, విద్యుత్ ఉద్యోగి దండ్ల రాజు, కాంట్రాక్టర్ శ్రీనివాస్, పీఈటీ, శ్రీను, మొబైల్ షాప్ గణేష్ తదితరులు ఈ కార్యక్రమం చేపట్టారు. 250 మంది విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు. పాఠశాలలో తాము చదువుకున్న రోజులు గుర్తుకొస్తున్నాయని క్రమశిక్షణ సంస్కారం, విద్యా బుద్దులను నాటి గురువులు అలవర్చారని పూర్వవిద్యార్థులు గుర్తు చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు

నవీపేట,జూలై11(ఆంధ్రజ్యోతి): మండలంలోని బినోల జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో శుక్రవారం పీఆర్‌టీయూ సభ్యత్వనమోదు చేపట్టారు. పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు సభ్యత్వ నమోదును స్వీకరించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు వీ.మోహన్ రెడ్డి, మండల అధ్యక్షులు భూమయ్య, శివ కుమార్, సుధాకర్ రెడ్డి, రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తులు

నవీపేట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మోడల్ పాఠశాలలో గంటల ప్రతిపాదికన నియామకం కోసం టీజీటీ, పీజీటీ పోస్టులభర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. పీజీటీ తెలుగు పోస్టుకు ఎంఏ తెలుగు బీఈడీ, టీజీటీ మ్యాథ్ పోస్టుకు ఎమ్మెస్సీ మ్యాథ్ బీఈడీతో పాటు టెట్ క్వాలిఫై ఉండాలని ఆయన పేర్కొన్నారు. అభ్యర్థులు తమ బయోడేటాతో విద్యార్హత జిరాక్స్‌లు తీసుకుని ఈ నెల 14 సోమవారం రోజున పాఠశాలలో జరిగే ఇంటర్వ్యూకు హజరుకావాలని కోరారు.

గోదావరి జలాలతో అభిషేకం

నవీపేట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): వర్షాలు బాగా కురువాలని కోరుతూ శుక్రవారం మండలంలోని బినోలలో గోదావరి జలాలతో గ్రామ దేవతలకు అభిషేకం నిర్వహించారు. పలువురు గ్రామస్థులు గోదావరి నుండి బిందెలతో జలాలను తీసుకువచ్చి గ్రామంలో ఉన్న ఆలయాలలో దేవత మూర్తులకు అభిషేకం నిర్వహించారు. వర్షాలు బాగా కురిసి పాడిపంటలు చల్లగా ఉండాలని కోరుతూ మొక్కులు చెల్లించుకున్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కుల పంపిణీ

నవీపేట,జూలై11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శుక్రవారం పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి చొరవతో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు 4.30లక్షల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు మంజూరు కాగా కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో భగవాన్, మోస్రా సాయిరెడ్డి, గంగాధర్, గోపాల్, సాయన్న, వసంత్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన

నవీపేట,జూలై11(ఆంధ్రజ్యోతి): మండలంలోని జన్నేపల్లి ఎస్ఎస్ఆర్ సీబీఎస్ఈ పాఠశాలలో శుక్రవారం హెడ్ బాయ్, హెడ్ గర్ల్ స్టూడెంట్ కౌన్సిల్ ఎన్నికలు నిర్వహించారు. పాఠశాలకు చెందిన 9వ తరగతి చదివే ముగ్గురు బాలురు, ఐదుగురు బాలికలు హెడ్ బాయ్, హెడ్ గర్ల్ ఎన్నికల పోటీలలో పాల్గొన్నారు. పాఠశాలలో 1వ తరగతి నుండి 9వ తరగతి వరకు చదివే విద్యార్థిని, విద్యార్థులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కార్యక్రమంలో సీఈవో హరిత మారయ్య గౌడ్, ప్రిన్సిపాల్ భాస్కర్, డైరెక్టర్ హర్షిత్ గౌడ్, సెంటర్ హెడ్ శ్రావణి ప్రియ, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

కల్లూర్‌లో బోనాల పండుగ

కోటగిరి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పొతంగల్ మండలంలోని కల్లూర్ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు ఆషాడమాసంను పురస్కరించుకుని శుక్రవారం బోనాల పండుగ నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థులు బోనాలు ఎత్తుకుని రేణుకా ఎల్లమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. బోనాల సంస్కృతి, సంప్రదాయాలను విద్యార్థులకు నేర్పాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో లోల శంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలను ధ్వంసం చేసిన వారిపై కేసు

కోటగిరి,జూలై11(ఆంధ్రజ్యోతి): మండలంలోని హరిలాల్ తండా ప్రభుత్వ పాఠశాలను ధ్వంసం చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు కోటగిరి ఎస్ఐ సునీల్ తెలిపారు. సుద్దులం తండా గ్రామానికి చెందిన శంకర్ వర్ని మండలం సేవాలాల్ తండాకు చెందిన శ్రీకాంత్ అనే వ్యక్తులు పాఠశాల గోడలు, స్లాబ్‌ను ధ్వంసం చేశారు. ఉపాధ్యాయులు వారిస్తున్నా పాఠశాల స్థలం తమదేనంటూ గోడలు ధ్వంసం చేశారు. ఈ విషయమై ప్రధానోపాధ్యాయురాలు సుల్తానా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

'పరిసరాల పరిశుభ్రతను పాటించాలి'

కోటగిరి,జూలై11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శుక్రవారం ఫ్రైడే, డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల కేంద్రంలోని మాలివాడ, ఎస్సీ కాలనీ, జరీనా కాలనీ, వినాయక్‌నగర్‌తో పాటు పలు కాలనీల్లోని ఇళ్లలో చాలాకాలంగా నిల్వ ఉన్న నీటిని పారబోయించారు. నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి సూచించారు. తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. నీరు నిలిచిన ప్రదేశాలలో ఆయిల్ బాల్స్ వేశారు.

రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిని కలిసిన నాయకులు



రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన దృశ్యం

రుద్రూరు, జూలై11(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావును, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పైడి ఎల్లారెడ్డిని శుక్రవారం మండల బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు దొరబాబు, జిల్లా కార్యవర్గసభ్యులు సున్నం సాయిలు, ప్రశాంత్ గౌడ్, ఇల్తెమ్ శంకర్, రుద్రూరు మండల అధ్యక్షులు అలపాటి హరికృష్ణ, కటిక రామ్, రాజు, కృష్ణం రాజు, కుమ్మరి గణేష్, బోజిగొండ అనిల్, వివిధ ఆరు మండలాల సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రుద్రూరు తహసీల్దార్‌గా సురేందర్ నాయక్



రుద్రూరు,జూలై11(ఆంధ్రజ్యోతి): రుద్రూరు మండల తహసీల్దార్‌గా సురేందర్ నాయక్‌ను నియమిస్తూ నిజామాబాద్ జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. గతంలో రుద్రూరు తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన బి.తారాబాయి తాత్కాలిక సెలవుపై వెళ్లడంతో ఆమె స్థానంలో రుద్రూరు ఉప తహసీల్దార్‌గా పనిచేస్తున్న పీ.సురేందర్ నాయక్‌కి తహసీల్దార్ పూర్తి బాధ్యతలు అప్పజెప్పారు. శుక్రవారం రుద్రూరు మండల సమీకృత సముదాయ భవనం నందు తహసీల్దార్ కార్యాలయంలో సురేందర్ నాయక్ బాధ్యతలు స్వీకరించారు.

మద్యం మత్తులో కాలువ గట్టు నుంచి జారిపడి వ్యక్తి మృతి

రుద్రూరు,జూలై11(ఆంధ్రజ్యోతి): రుద్రూరు మండలం అక్బర్‌నగర్ గ్రామానికి చెందిన మేత్రి రవి(35) అనే వ్యక్తి గురువారం సాయంత్రం కాలకృత్యాలకు వెళ్లి మద్యం మత్తులో పొలం కాలువ గట్టు నుంచి జారిపడి మృతిచెందినట్లు ఎస్ఐ సాయన్న పేర్కొన్నారు. మృతుని భార్య మేత్రి సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాయన్న వెల్లడించారు.


గూడ్స్ నుంచి లారీలోకి యూరియా బస్తాలను తరలిస్తున్న కూలీలు

జిల్లాకు చేరిన యూరియా బస్తాలు

● డిచ్‌పల్లి రైల్వే స్టేషన్ గూడ్స్ రైలు నుంచి లారీల్లో తరలింపు

● తీరనున్న రైతుల కష్టాలు

డిచ్‌పల్లి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొన్ని రోజులుగా యూరియా ఎరువుల కొరత ఉండటంతో ఇబ్బందులు పడ్డ రైతన్నలకు సమస్య తీర్చేందుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవడంతో శుక్రవారం యూరియా ఎరువుల బస్తాలు జిల్లాకు చేరాయి. రైల్వే గూడ్స్ డిచ్‌పల్లి రైల్వే స్టేషన్‌కు చేరింది. దీంతో ఉదయం వేకువ జామున నుంచే రైల్వే గూడ్స్ నుంచి లారీల్లో డంప్ చేసి యూరియా జిల్లా కేంద్రంతో పాటు జిల్లా నలు మూలలకు తరలించారు. కొద్ది రోజులుగా ఎరువుల కొరతతో ఇబ్బందులు పడ్డ రైతులకు ఈ యూరియాతో కొంత ఉపశమనం పొందనున్నారు. పూర్తిస్థాయిలో రైతులకు సరిపడా యూరియాను అందుబాటులో ఉంచాలని రైతులు కోరుతున్నారు.


ఎరువుల బస్తాల తరలింపు తరలివచ్చిన లారీలు

ఆదర్శం.. మిర్ధాపల్లి ప్రాథమిక పాఠశాల

● పెరుగుతున్న విద్యార్థుల సంఖ్య ● తల్లిదండ్రులను ఆకర్షిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు



మిర్ధాపల్లి ప్రభుత్వ పాఠశాల

ఆలూర్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లా ఆలూర్ మండలం మిర్ధాపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాల ఎన్నో పాఠశాలలకు ఆదర్శంగా నిలుస్తోంది. 2016కు ముందు అతికొద్ది మంది విద్యార్థులతో పాఠశాల నడిచేది. కానీ 2016 తర్వాత ఇంగ్లీష్ మీడియం ప్రారంభించి ఎల్‌కేజీ, యుకేజీ క్లాసులలో విద్యార్థులను చేర్చుకున్నారు. ఇంగ్లీష్ మీడియం బోధనకు తల్లిదండ్రులు, గ్రామస్థులు సహకరించి ఆర్థిక సహాయాన్ని అందించి విద్యా వలంటీర్లను నియమించారు. దీంతో పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 200కు పైగా చేరింది. అంతేకాకుండా ప్రైవేట్ పాఠశాలలకు తమ పిల్లలను పంపవద్దని ఒక నిబంధనను విధించుకుని తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ఇతర గ్రామాల నుంచి కూడా విద్యార్థులు వచ్చే విధంగా ప్రయత్నాలు చేశారు. ఈ రకమైన ప్రయత్నంతో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఈ పాఠశాలలో గతంలో చదివిన వారు సైతం ఈ పాఠశాల అభివృద్ధికి తమ సహాయం చేశారు. గ్రామానికి చెందిన ఐపీఎస్ అధికారి గంగారెడ్డి చొరవతో హైదరాబాద్‌కు చెందిన ఇంజనీర్ విత్‌అవుట్ బార్డర్ ట్రస్ట్ వారు డిజిటల్ క్లాసులు ఏర్పాటుకు సరిపడా ప్రొజెక్టర్, ఇతర పరికరాలు, ఫర్నిచర్ సమకూర్చారు. ప్రస్తుతం ఎల్‌కేజీ నుంచి 5వ తరగతి వరకు డిజిటల్ తరగతులను బోధిస్తున్నారు. విద్యార్థుల సౌకర్యార్థం దాత వినయ్‌రెడ్డి వాటర్ ప్యూరి ఫైర్ విరాళంగా అందజేశారు. విద్యార్థులు ఆడుకోవడానికి గ్రామ అభివృద్ధి కమిటీ వారు ఆట స్థలాన్ని సైతం సమకూర్చారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులు, ఉపాధ్యాయులు తోటి విద్యార్థులతో కలిసి ఇంగ్లీష్‌లోనే మాట్లాడాలన్న నిబంధన విధించడం ద్వారా ఇంగ్లీష్ నైపుణ్యాన్ని సంపాదించారు. పాఠశాల నిర్వహణకు గ్రామస్థులు సైతం తమ సహాయ సహకారాలు అందిస్తున్నారు. స్కూల్ డే, అనేక సాంస్కృతిక కార్యక్రమాలను సైతం ఎంతో ఘనంగా జరుపుతూ విద్యార్థులను వారి తల్లిదండ్రులను ఆకర్షించే విధంగా పాఠశాల యాజమాన్యం కృషి చేస్తుంది. ఇలాంటి కార్యక్రమాల ద్వారా మరెన్నో పాఠశాలలు కూడా ఇలాంటి పాఠశాల మాదిరిగా అభివృద్ధి చెంది ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలని చెప్పకనే చెబుతున్నారు.

అందరి కృషితో పాఠశాల అభివృద్ధి



● టి. సాయిరెడ్డి, మిర్ధాపలి

మా గ్రామంలో పాఠశాలను సందర్శించినప్పుడు చాలా శిథిలావస్థలో కనిపించింది. ఇదిలా జరిగితే మేము చదివిన పాఠశాల మూసివేసే ప్రయత్నం జరుగుతుందని, ప్రైవేట్ పాఠశాలలకు విద్యార్థులను పంపకుండా మేమంతా కలిసి చందాలు పోగు చేశాము. విద్యా వలంటీర్లను పెట్టుకుని, సరిపడా అటెండర్లను పెట్టుకొని వారికి జీతాలను మేమే ఇచ్చి, ప్రభుత్వ విద్యను కాపాడడానికి మేము చేసిన ప్రయత్నం ఫలితాలను ఇచ్చింది. మా పిల్లలు కూడా ఇదే పాఠశాలలో చదివి ఇప్పుడు పై చదువులు చదువుతున్నారు.

గ్రామస్థుల సహకారం ఎంతో ఉంది..

● రాజశ్రీ ప్రధానోపాధ్యాయురాలు

మా పాఠశాల ఇంత అద్భుతంగా పని చేయడానికి కారణం గ్రామం యువత, గ్రామ ప్రజలు. పిల్లల ప్రోత్సాహం వల్లనే మేము ఇంత విజయవంతంగా మా పాఠశాలను నడుపుతున్నాం. మాకు ఉన్న సమస్య ఏమిటంటే అటెండర్ సమస్య ఉంది. అదే విధంగా తరగతి గదుల కొరత ఉంది. వీలు ఉన్నప్పటికీ ప్రభుత్వ ఉపాధ్యాయుల కొరత ఉంది. మేము మా పై అధికారులకు విన్నవించాము. వారు మా సమస్య తీరుస్తామని మాటిచ్చారు.




కస్తూర్బా గాంధీ పాఠశాల ప్రాంగణంలో ప్రమాదకరంగా మారిన నీటి గుంత


గదుల్లో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థినులు

కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో

ప్రమాదకరంగా మారిన గుంత

● ఒకే గదిలో విద్యాభ్యాసం.. సౌకర్యాలు కరువు

● పాఠశాలలో దోమల బెడద.. గదుల కొరత

బోధన్‌రూరల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): బోధన్ మండలంలోని అమ్దాపూర్ గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల ప్రాంగణంలో గతంలో మొరం తవ్వకాలు చేపట్టడంతో అక్కడ గుంత ప్రమాదకరంగా మారింది. గుంతను పూడ్చాలని అనేక మార్లు ఉన్నతాధికారులకు ప్రిన్సిపాల్ హిమబిందు విన్నవించిన పట్టించుకునే వారే కరువయ్యారు. అనుకోకుండా జరగారని సంఘటన జరిగితే బాధ్యతలు ఎవరని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నించారు. ప్రమాదకరంగా ఉన్న గుంతను పూడ్చాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు కోరుతున్నారు. వర్షాకాలంలో వర్షపు నీరు పాఠశాల ప్రాంగణంలోకి చేరడంతో పాఠశాల చిన్న చెరువులా తలపిస్తుంది. సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదకరంగా గుంతను సందర్శించి పూడ్చాలని కోరుతున్నారు.

● గదుల కొరత.. దోమల బెడద

కస్తూర్బా గాంధీ పాఠశాలలో గదుల కొరత ఉండడంతో ఒకే తరగతి గదిలో విద్యార్థులు చదువుతో పాటు అసౌకర్యాల మధ్య ఉంటున్నారు. తరగతి గదులోనే రాత్రిపూట విద్యార్థులు అక్కడే బస చేస్తున్నారు. అదనపు తరగతి గదులు నిర్మించాలని విద్యార్థులు కోరుతున్నారు.

పాఠశాలలో 10వ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థినులకు


విద్యార్థుల వస్తువుల మధ్య విద్యా బోధన దృశ్యం

గదులు సరిపోకపోవడంతో ఒకటే గదిలో అసౌకర్యాల మధ్య చదువుకుంటున్నారు. పాఠశాల ప్రాంగణం పైభాగంలో మొరం తవ్వకాలు జరిగేవి. వర్షానికి మొరం పాఠశాల ప్రాంగణానికి చేరుకుంది. పాఠశాలకు వర్షపు నీరు చేరడంతో దోమలు తీవ్రంగా వ్యాపిస్తున్నాయి. దోమల బెడదతో విద్యార్థినులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యార్థినుల సౌకర్యార్థం దోమ తెరలను ఇప్పించాలని విద్యార్థినులు కోరుతున్నారు. ఉదయం చదువులు అయిపోగానే సాయంత్రం అదే రూమ్‌లో బెంచీలు జరిపి బస చేస్తున్నారు. పాఠశాలకు అవసరమైన తరగతి గదులు నిర్మించాలని విద్యార్థినులు కోరుతున్నారు. పాఠశాల ప్రాంగణంలో గతంలో మొరం తవ్వకాలు చేపట్టడంతో గుంత ప్రమాదకరంగా మారింది. గుంతను పూడ్చాలని అనేకమార్లు ఉన్నతాధికారులకు ప్రిన్సిపాల్ విన్నవించిన పట్టించుకునే వారే కరువయ్యారు. ఎటువంటి అనుకుని సంఘటన జరగముందే ప్రమాదకరంగా మారిన నీటిగుంతను పూడ్చాలని విద్యార్థులు కోరుతున్నారు. వర్షకాలంలో వర్షపు నీరు పాఠశాల ప్రాంగణంలోకి చేరడంతో బురదమయంగా మారి పాఠశాల చిన్న చెరువులా కనిపిస్తుందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైన సంబంధిత అధికారులు స్పందించి పాఠశాల ప్రాంగణంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని అదనపు తరగతి గదులు నిర్మించాలని, ప్రమాదకరంగా మారిన నీటిగుంతను పూడ్చివేయాలని కోరుతున్నారు. పాఠశాల ప్రాంగణంలో ప్రమాదకరంగా మారిన నీటి గుంతలో నీరు నిల్వడంతో దోమల బెడద అధికంగా మారింది. సాయంత్రం అయిదంటే చాలు దోమలు గుయ్ గుయ్ అంటూ తిరుగుతున్నాయి. వెంటనే ప్రభుత్వం విద్యార్థుల సౌకర్యార్థం దోమ తెరలను ఇప్పించాలని, కిటికిలకు జాలీలను ఏర్పాటు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

● బిల్డింగ్ నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి..

కస్తూర్బా గాంధీ పాఠశాల ప్రాంగణంలో నిర్మిస్తున్న కొత్త బిల్డింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలి నూతనంగా నిర్మిస్తున్న బిల్డింగ్ కొన్ని రోజులుగా అసంపూర్తిగా ఉన్న ప్రస్తుతం కొనసాగుతున్న పనులు వేగవంతంగా పూర్తి చేసి త్వరగా విద్యార్థులకు సౌకర్యవంతమయ్యేలా పూర్తి చేయాలి. కొన్నేళ్లుగా బిల్డింగ్ నిర్మాణ పనులు కొనసాగుతున్న ఇంకా నిర్మాణ పనులు రంగుల పనులు కొనసాగుతున్నాయి. త్వరగా బిల్డింగ్ నిర్మాణ పనులు పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తేవాలి.

● సరిపడా గదులు లేక ఇబ్బందులు

అమూల్య, ఇంటర్ ఫస్ట్ ఇయర్, బోధన్



తమ పాఠశాలలో ఉపాధ్యాయ బృందం విద్యబ్యాసం బాగున్నా పాఠశాల పూర్తయిన తర్వాత సరిపడ గదులు లేక ఈ తరగతి గదుల్లోనే అసౌకర్యాల మధ్య బస చేస్తున్నాం. సంబంధిత అధికారులు స్పందించి అదనపు తరగతి గదులను నిర్మించాలి.

● మొరం కొట్టుకురావడంతో బురదమయం

కే.దీపిక, ఇంటర్ ఫస్ట్ ఇయర్ బైపీసీ, బోధన్



వర్షకాలంలో పాఠశాల ప్రాంగణంలో వర్షపు నీటితో పాటు మొరం కొట్టుకురావడంతో బురదమయంగా పాఠశాల ప్రాంగణం మారుతుంది. పాఠశాల నుండి బయటకు వెళ్లాలన్న, లోపలికి రావాలన్న అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. పాఠశాల గదుల్లోనే పెట్టెలు, బాక్స్‌లు, ఇతర వస్తువులు తరగతి గదిలోనే పెట్టుకోవాల్సి వస్తుందని దీని వల్ల విద్యార్థులందరరికీ అసౌకర్యం ఉంది.

● నిర్మాణ పనులు త్వరగా పూర్తయితే విద్యార్థినులకు సౌకర్యవంతం

హిమబిందు, కస్తూర్బా గాంధీ ప్రిన్సిపాల్, అమ్దాపూర్



బిల్డింగ్ నిర్మాణ పనులు త్వరగా పూర్తయితే విద్యార్థినులకు సౌకర్యవంతంగా ఉంటుంది. ప్రమాదకర గుంతను సంబంధిత అధికారులు స్పందించి పూడ్చాలి.

శిథిలావస్థకు చేరిన జక్రాన్‌పల్లి ప్రాథమిక

పశువైద్య కేంద్ర కార్యాలయ భవనం

● వర్షం పడితే పెచ్చులూడిపోయి సిబ్బందిపై పడుతున్న వైనం ● పట్టించుకోని అధికారులు



శిథిలావస్థలోకి చేరిన జక్రాన్‌పల్లి ప్రాథమిక పశువైద్య భవనం

జక్రాన్‌పల్లి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పశు వైద్య భవనం ఏళ్ల క్రితం నిర్మించగా ప్రస్తుతం ఆ భవనం శిథిలావస్థకు చేరింది. జక్రాన్‌పల్లిలో ఉన్న ప్రాథమిక పశువైద్య కేంద్ర కార్యాలయ భవనం ప్రస్తుతం పూర్తిగా శిథిలావస్థలోకి చేరింది. ఈ భవనం కూలి పోయే స్థితికి చేరుకుంది. మండల కేంద్రం లోని జక్రాన్‌పల్లితో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పశువులకు, జీవాలకు రోగాలు వస్తే చికిత్స చేయించడానికి పశువులను తీసుకు వస్తుంటారు. కొన్ని సందర్భాల్లో పశువైద్య సిబ్బంది రైతుల ఇంటి వద్దకు వెళ్లి పశువులకు చికిత్స చేస్తారు. ప్రస్తుతం జక్రాన్‌పల్లిలో ఉన్న పశువైద్య భవనం శిథిలావస్థకు చేరి కూలి పోయే స్థితిలో ఉంది. నాలుగు అక్టోబర్ 1974లో ఈ పశు వైద్య భవనాన్ని నిర్మించి ప్రారంభించారు. అప్పటి నుంచి ఈ భవనంలో విధులు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం వర్షాకాలం అయినందున వర్షాలు పడడంతో ఈ భవనంపై కప్పు పెచ్చులు ఊడిపోయి పడుతున్నాయి. వరండ, రెండు గదులలో పై కప్పు పెచ్చులు ఊడిపోయి సిబ్బందిపై పడ్డాయని తెలిపారు. వర్షాకాలం వర్షాలు కురవడంతో ఈ పశు వైద్య భవ నంలో ఉన్న బీరువా, ఫైళ్లు, ఇతర వస్తువులు తడిసి పోతున్నాయి. నూతన భవన నిర్మాణానికి నోచుకోవడం లేదు. ఇప్పటికైనా సంబంధి అధికారులు స్పందించి శిథిలావస్థలోకి చేరిన జక్రాన్‌పల్లి ప్రాథమిక పశువైద్య కేంద్ర నూతన కార్యాలయ భవనాన్ని నిర్మించాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.


పెచ్చులూడిపోయిన పై కప్పు భవనం దృశ్యం

నూతన పశు వైద్య భవన నిర్మాణానికి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

- హర్షిత, పశువైద్యాధికారిణి, జక్రాన్‌పల్లి



జక్రాన్‌పల్లిలో శిథిలావస్థలోకి చేరిన ప్రాథమిక పశువైద్య కేంద్ర కార్యాలయ భవనం పూర్తిగా శిథిలావస్థలోకి చేరగా నూతన భవన నిర్మాణానికి నిధుల మంజూరుకు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున భవనం పూర్తిగా ఉరుస్తుంది. దీంతో పశువైద్య భవనంలో ఉన్న ఫైల్‌లు, ఇతర వస్తువులు తడిసిపోతున్నాయి. నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి పనులను చేపట్టాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

టైలరింగ్, మగ్గం శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

డిచ్‌పల్లి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డిచ్‌పల్లి వారి ఆధ్వర్యంలో జూలైలో ప్రారంభమయ్యే టైలరింగ్, మగ్గం ఉచిత శిక్షణలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డైరెక్టర్ రవికుమార్ తెలిపారు. ఈ ఉచిత శిక్షణ 31 రోజులు ఉంటుందని, శిక్షణ సమయంలో ఉచిత భోజనం, హాస్టల్ వసతి కూడా ఉంటుందని పేర్కొన్నారు. అర్హులైన మహిళా అభ్యర్థినులు, 19 నుంచి 45 ఏళ్లలోపు ఉండి నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల గ్రామీణ ప్రాంత మహిళలు ఈ అవకాశం ఉపయోగించుకోవాలని డైరెక్టర్ కోరారు. ఆసక్తి గల వారు ఆధార్, రేషన్ కార్డు, పదో తరగతి మె మో, 5 ఫోటోలు, తీసుకొచ్చి డిచ్‌పల్లి కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. వివరాలకు 08461 295428, నంబర్‌కు సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు

12 గంటలకే అంగన్‌వాడీ భవనానికి తాళం



అంగన్‌వాడీ పాఠశాలకు తాళం

జుక్కల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): జుక్కల్ మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయం పక్కన ఎస్సీ కాలనీలో గురువారం రోజు ఉదయం 12 గంటలకు అంగన్‌వాడీ పాఠశాలకు తాళం వేసిన టీచర్ ఇంటికి వెళ్లి పోయింది. అంగన్‌వాడీకి వచ్చిన విద్యార్థులకు ప క్కన ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యా ర్థులను కూర్చుండబెట్టి బోధకురాలు ఇంటికి వెళ్లింది. గురువారం రోజు గురు పౌర్ణమి ఉండటంతో అంగన్‌వాడీ టీచర్ 10 గంటలకు వచ్చి 12 గంటలకు ఇంటికి వెళ్లిందా ఇంటికి వెళ్లినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. జుక్కల్ మండలం కర్ణాటక మహారాష్ట్ర సరిహద్దులో ఉండ టంతో సంబంధిత అధికారులు నిఘా లేకపోవడంతో అంగన్‌వాడీ టీచర్లు విధులకు డుమ్మా కొడుతున్నట్లు బహిరంగ ఆరోపణ వినిపిస్తున్నాయి. కేవలం 25 కిలో మీటర్ల దూరంలో మద్నూర్ సీడీపీవో పర్య వేక్షణ లేకపోవడంతో జుక్కల్ మండలంలో అంగన్ వాడీ టీచర్లు నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తున్నారని జుక్కల్ గ్రామ పెద్దలు పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అంగన్‌వాడీ పాఠశాలను తనిఖీ చేసి పిల్లలకు పౌష్టికాహారం, విద్య నేర్పించాలని గ్రామ పెద్దలు కోరారు.

టీయూ లైబ్రరీకి పుస్తకాలు అందజేత

డిచ్‌పల్లి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ప్రొ.కొలకలూరి ఇనాక్ రచించిన తెలుగుసాహిత్య పుస్తకాలను టీయూ సీనియర్ తెలుగు విభాగం అధ్యాపకుడు ప్రొ.డప్పు కనకయ్య శుక్రవారం తెలంగాణ వర్సిటీ సెంట్రల్ లైబ్రేరియన్ సత్యనారాయణకు అందజేశారు. ఈ నూతన తెలుగు సాహిత్య పుస్తకంతో విద్యార్థులు మరెన్నో నూతన విషయలు తెలుసుకోవచ్చునని కనకయ్య పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు విభాగం అధ్యాప కులు డా. లావణ్య, సిబ్బంది పాల్గొన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

సుభాష్‌నగర్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యం బారినపడి చికిత్స చేసుకున్న బాధితులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అందజేశారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధన్‌పాల్ మాట్లాడుతూ.. సీఎం సహాయనిధి ద్వారా 96 మందికి సుమారు 28లక్షల 87వేల 500 రూపాయల విలువ గల చెక్కులను అందజేయడం జరిగిందన్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించడానికి, అత్యవసర ఆరోగ్య అవసరాలకు సీఎం సహాయనిధి ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలకు ఆర్థిక భరోసా లభిస్తుందన్నారు. నియోజకవర్గంలో ఎవరైనా ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ వైద్యం పొందలేని పరిస్థితుల్లో ఉంటే సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ఆదుకోవడం జరుగుతుందన్నారు. ఇప్పటికే అనేక మందికి సీఎంఆర్‌ఎఫ్ నిధులు మంజూరు చేయించామని అర్హులైన ప్రతి ఒక్కరికి సహాయం అందేలా చూస్తామన్నారు. సీఎంఆర్‌ఎఫ్ దరఖాస్తుల విషయంలో ఎటువంటి జాప్యం లేకుండా క్యాంప్ కార్యాలయం నుండి దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్క లబ్ధిదారుని దరఖాస్తులను సెక్రెటరియేట్‌కు పంపడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తు చేసుకున్న మొత్తంలో 15-20 శాతమే చెల్లిస్తుందని 50 శాతం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కార్పొరేటర్లు, మండల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

గవర్నర్‌తో రెడ్‌క్రాస్ ప్రతినిధుల సమావేశం



గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు

సుభాష్‌నగర్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్, రాష్ట్ర రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షుడు విష్ణుదేవ్ వర్మను జిల్లా రెడ్‌క్రాస్ సభ్యులు శుక్రవారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. గవర్నర్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా తెలంగాణ టీబీ రహిత రాష్ట్రంగా మారేలా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రతీ జిల్లాలో రక్తనిధి కేంద్రాలు, రక్తం నిల్వ కేంద్రాలు ఏర్పాటు చేసి అవసరమైనప్పుడు రక్తం అందుబాటులో ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో విద్యాసంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థులు యూత్ రెడ్‌క్రాస్, జూనియర్ రెడ్‌క్రాస్‌లు సభ్యత్వం పొందేలా ప్రోత్సహించి సీపీఆర్ వంటి అత్యవసర శిక్షణలు అందించాలని సూచించారు. రెడ్‌క్రాస్ మెంబర్‌షిప్ నిర్వహించి జీవితకాల సభ్యులను చేర్చుకొని పక్క రాష్ట్రాలతో పోటీపడేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ రాష్ట్ర పాలక మండలి సభ్యులు తోటరాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ జనాభా దినోత్సవంపై అవగాహన ర్యాలీ

సుభాష్‌నగర్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. నగరంలోని చంద్రశేఖర్ కాలనీలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి చేపట్టిన ర్యాలీని జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి రాజశ్రీ జెండా ఊపి ప్రారంభించారు. చంద్రశేఖర్ నగర్ ప్రధాన కూడలిలో మానవహారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో రాజశ్రీ మాట్లాడుతూ.. మరణాలకు, జనాభా పెరుగుదలకు కారణమైన బాల్య వివాహాలను నిషేధించాలన్నారు. ఆరోగ్య ఉప కేంద్రం పరిధిలో అర్హులైన దంపతుల రికార్డులను సవరించాలని, అర్హులైన దంపతులందరికీ శాశ్వత, తాత్కాలిక కుటుంబ నియంత్రణ పద్ధతులను అవలంబించేలా చూడాలన్నారు. ఆశాలు, ఏఎన్‌ఎంలు గృహ సందర్శనలో భాగంగా ప్రతి ఇంటిలోని అర్హులైన దంపతులను శాశ్వత, తాత్కాలిక కుటుంబ నియంత్రణ పద్ధతుల కోసం కౌన్సెలింగ్ చేయాలన్నారు. జిల్లాలో పురుషుల కొరకు కుటుంబ నియంత్రణ చికిత్స అయిన ఎన్‌ఎస్‌వీ/వెసక్టమీని ఆర్మూర్, డిచ్‌పల్లి, మోర్తాడ్ కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తాత్కాలిక కుటుంబ నియంత్రణ పద్ధతులైన పీపీఐయూడీసీ, ఐయూడీసీ, కాపర్ టి, ఛాయ, అంతర ఇంజెక్షన్, ఓరల్ పిల్స్‌ల కోసం నిరోధ లాంటివి వాడి జనాభాను నియంత్రించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్‌వో డాక్టర్ అంజన, జిల్లా మలేరియా అధికారి తుకారాం రాథోడ్, టిపీఎంసీహెచ్ డాక్టర్ సుప్రియ, డాక్టర్ స్వామాట్ యాదవ్, డాక్టర్ శిఖార, నాగలక్ష్మీ, గఫూర్ వెంకటేశ్వర్లు, వేణుగోపాల్, స్వామి సులోచన, శ్రీనివాస్, లింగారెడ్డి, గోవర్ధన్, నాగరాజు, వెంకటేశం, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫీజు బకాయిలను విడుదల చేయాలి

నిజామాబాద్ కల్చరల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని స్కాలర్‌షిప్ బకాయిలను విద్యార్థులకు అందించాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురాం డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో ఏవో ప్రశాంత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి విద్యార్థులు ప్రభుత్వం ఇచ్చే ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలతోనే చదువుకుంటున్నారని అన్నారు. సకాలంలో ప్రభుత్వం నిధులు సమకూర్చకపోవడంతో విద్యార్థులు అయోమయానికి లోనవుతున్నారని అన్నారు. మూడు విద్యాసంవత్సరాల నిధులు మొత్తం 6వేల కోట్ల రూపాయలు ఉన్నాయని వెంటనే ఫీజురీయంబర్స్‌మెంట్ ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనేక కళాశాలల యజమానులు ఫీజులు కడితేనే సర్టిఫికెట్లు ఇస్తామని అనడంతో తల్లిదండ్రులు అప్పులు చేసి మరీ ఫీజులు కట్టే పరిస్థితి వచ్చిందన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు పూర్తవుతున్నా బకాయిలు విడుదల చేయకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వం కూడా మాటతప్పిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా నాయకులు నవీన్, కృష్ణ, సంతోష్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకింగ్ రంగంపై అవగాహన సదస్సు

సుభాష్‌నగర్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని గిరిరాజ్ ప్రభుత్వ కళాశాలలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కామర్స్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు శుక్రవారం బ్యాంకింగ్ రంగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరై ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ మహేశ్వర్ కోలేటి, హెచ్ ఆర్ మేనేజర్ రాజన్న పవర్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఎస్‌బీఐ అందిస్తున్న సేవలపై ఉద్యోగ అవకాశాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.రామ్మోహన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రంగరత్నం, కామర్స్ విభాగం అధిపతులు వినయ్ కుమార్, డాక్టర్ రంజిత, పీఆర్‌వో దండు స్వామి, గ్రంథాలయ అధికారి పూర్ణచందర్ రావు, వివిధ విభాగాల అధిపతులు డాక్టర్ రామకృష్ణ, రమేష్ గౌడ్, ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ డాక్టర్ రామస్వామి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

▸ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి

మోపాల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన పేదలకు మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. శుక్రవారం రూరల్ మండలంలోని గుండారం, మల్కాపూర్ (ఎ), లక్ష్మాపూర్ గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎమ్మెల్యే పర్యవేక్షించారు. లక్ష్మాపూర్ గ్రామంలో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా గ్రామంలో మొక్కలను నాటారు. అనంతరం మల్కాపూర్ (ఎ), లక్ష్మాపూర్ గ్రామాల్లో నిర్మాణం అవుతున్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రూరల్ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పది సంవత్సరాలు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఒక్కరికి కూడా ఇండ్లను మంజూరు చేయలేకపోయారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ ఇందిరమ్మ ఇండ్ల రాజ్యం వచ్చిందని అన్నారు. అర్హులైన పేదలందరికి ఇండ్లను మంజూరు చేయడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో 3603 ఇందిరమ్మ ఇండ్లు పేద వారికి మంజూరు చేయడం జరిగిందని అన్నారు. ఆస్తుల కోసం కేసీఆర్ కుటుంబం కొట్లాడుకుంటుందని అన్నారు. బీజేపీతో పొత్తు కోసం విస్తృత ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు మతిస్థిమితం కోల్పోయారని అన్నారు. బీసీ డిక్లరేషన్ పై కట్టుబడి ఉన్నామన్నారు. సర్వేలో బీసీలు 56శాతంఉన్నారని దాని ప్రకారం 42శాతం రిజర్వేషన్ ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. దేశంలోనే మోడల్‌గా కాంగ్రెస్ ప్రభుత్వం నిలుస్తుందని



ఇందిరమ్మ ఇళ్లను పరిశీలిస్తున్న రూరల్ ఎమ్మెల్యే

తెలిపారు. బీజేపీ కూడా జనగణన చేపట్టాలని నిర్ణయించిందని తెలిపారు. ఇందిరమ్మ లబ్ధిదారుల వద్ద నుంచి ఎవరైనా డబ్బులు తీసుకుంటే వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేసి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. మీసేవల ద్వారా అవినీతి జరుగుతున్నట్లు ఫిర్యాదు వచ్చాయని వాటిపై విచారణ కొనసాగిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, నాయకులు మునిపల్లి సాయిరెడ్డి, బాగిర్తి బాగారెడ్డి, గుండారం సొసైటీ చైర్మన్ శ్రీధర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎల్లయ్య, ఒడ్డెన్న, పూర్ణచందర్‌రాజు, కోర్వ గంగాధర్, మోహన్, జనార్ధన్, నగేష్, శేఖర్‌గౌడ్, సాయన్న, తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్‌కు 25 శాతం టికెట్లు

▸ స్థానిక సంస్థల ఎన్నికల్లో యువతకు ప్రాధాన్యం

▸ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శివచరణ్‌రెడ్డి

సుభాష్‌నగర్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో యూత్ కాంగ్రెస్‌కు 25 శాతం టికెట్లు ఇవ్వనున్నట్లు రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శివచరణ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం నగరంలోని సందీప్ గార్డెన్‌లో జిల్లా యూత్ కాంగ్రెస్ సమీక్ష సమావేశం జిల్లా అధ్యక్షుడు తాళ్ల విపుల్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ రిజర్వేషన్ల పెంపుపై రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేసిన సందర్భంగా రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి ధన్యవాదాలు తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో యూత్ కాంగ్రెస్ నాయకులకు 25 శాతం టికెట్లు ఇప్పించేందుకు కృషి చేస్తానన్నారు. రానున్న ఎన్నికల్లో యూత్ కాంగ్రెస్ నాయకులు గెలుపు కోసం



మాట్లాడుతున్న యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివచరణ్‌రెడ్డి

పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



ధర్పల్లి ఎస్సైని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

శాంతిభద్రతల విషయంలో రాజీ లేదు

ధర్పల్లి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని ధర్పల్లి ఎస్సై కళ్యాణి అన్నారు. శుక్రవారం నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్సై కళ్యాణిని మండల కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. శాలువ, పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శాంతిభద్రతల విషయంలో మండల ప్రజలు పోలీసులకు సహకరించాలని అన్నారు. ఫ్రెండ్లీ పోలిసింగ్ తమ లక్ష్యం అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు గాదారి మనోహర్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి చెలిమెల నర్సయ్య, మిట్టపల్లి గంగారెడ్డి, అమీద్, సురేందర్‌గౌడ్, సుభాస్, లింగారెడ్డి, జమీల్, చక్రపాణి, గంగాధర్, అశోక్ పాల్గొన్నారు.

ఆరోగ్య శిబిరంపై అవగాహన సదస్సు

ఇందల్వాయి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఇందల్వాయి గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇందల్వాయి ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆరోగ్య విస్తరణ అధికారి శంకర్ మాట్లాడుతూ సీజన్ మారడం వల్ల వర్షాకాలంలో దోమలు అభివృద్ధి చెంది మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా, ఫైలేరియా, మెదడువాపు వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుందని దోమలు వృద్ధి చెందకుండా పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈగల వల్ల డయేరియా, కలర వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నాయన్నారు. పాఠశాల చుట్టూ వాతావరణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని పిచ్చిమొక్కలు, నీటి గుంతలు లేకుండా చూసుకోవాలన్నారు. విద్యార్థులకు పౌష్టికరమైన తాజా కూరగాయలను ఇవ్వాలని ప్రతీరోజు పాలు, గుడ్లు ఖచ్చితంగా ఆహారంలో ఉండేలా చూసుకోవాలన్నారు. సాయంత్రం ఉడకబెట్టిన పల్లీలు, బటానీలు, చెనిగలు తినాలని వాటిలో బీకాంప్లెక్స్ అధికంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ వినీత్, ఆరోగ్య కార్యకర్తలు శారద, భానుప్రియ, ఆశావర్కర్లు ప్రమీల జ్యోతి, ప్రియాంక పాల్గొన్నారు.

దాశరథి జయంతి ఉత్సవానికి రావాలి

● పీసీసీ అధ్యక్షుడికి ఆహ్వానం అందించిన ఉత్సవ కమిటీ

నిజామాబాద్ కల్చరల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మహాకవి దాశరథి కృష్ణమాచార్య శతజయంతి ఉత్సవానికి రమ్మని పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌కు శతజయంతి ఉత్సవ కమిటీ ఆహ్వానం అందించింది. హైదరాబాద్‌లోని మహేష్‌కుమార్‌గౌడ్ నివాసానికి వెళ్లిన ఆహ్వాన కమిటీ ప్రతినిధులు జూలై 21న నిర్వహించే శతజయంతి ఉత్సవానికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు సాయికుమార్ మాట్లాడుతూ నైజాంకు వ్యతిరేకంగా పోరాడి ప్రజలను తన కవితల ద్వారా చైతన్యవంతులు చేసిన దాశరథి కృష్ణమాచార్యతో జిల్లాకు అనుబంధం ఉందని అన్నారు. నిజాంకాలంలో ఖిల్లా జైల్లో జైలు జీవితాన్ని గడిపిన దాశరథి కృష్ణమాచార్య శతజయంతి ఉత్సవాన్ని 21వ తేదీన న్యూ అంబేద్కర్ భవన్‌లో నిర్వహిసామని తెలిపారు.

ఇందిరామహిళా శక్తిపై విస్తృత అవగాహన

సుభాష్‌నగర్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఇందిర మహిళా శక్తి కార్యక్రమాలపై మహిళా సంఘాల సభ్యులకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు. కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి ఆదే శాల మేరకు డీఆర్‌డీవో సాయాగౌడ్ జిల్లా పౌరసంబంధాల అధికారి ఎన్.పద్మశ్రీ నేతృత్వంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృం దాలు మహిళా సాధికారతపై కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా జిల్లా కేంద్రంలోని ఎంజీ ఫంక్షన్‌హాల్‌లో సాంస్కృ తిక కార్యక్రమాలను నిర్వహించారు. మహిళలకు ఇందిర మహిళా శక్తి కార్యక్రమాలపై పాటల రూపంలో అవగాహన కల్పించారు. వడ్డీలేని రుణాలు, మహిళా సాధికారత, ఉచిత బస్సు ప్రయాణం, ఆరు గ్యారంటీల అమలు, మహిళా శక్తి క్యాంటీన్‌లు, పెట్రోల్ బంక్‌ల నిర్వాహణ, సోలార్ పవర్ ప్లాంట్ యూనిట్లు, తదితర వాటిపై అవగాహన కల్పించారు.

ఊర పండుగకు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌కు ఆహ్వానం

నిజామాబాద్ కల్చరల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): సర్వసమాజ్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించనున్న ఊర పండుగకు హాజరుకావాలని పార్లమెంట్ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌ను సర్వసమాజ్ కమిటీ ఆహ్వానించింది. సర్వసమాజ్ కమిటీ ప్రతినిధులు ఆయనను కలుసుకొని గత 76 సంవత్సరాలుగా ప్రతియేటా అన్ని కుల సంఘాల ఆధ్వర్యంలో ఊర పండుగను నిర్వహించడం జరుగుతుందని వివరించారు. ఆయనను కలిసిన వారిలో సర్వసమాజ్ కమిటీ కన్వీనర్ రాంబర్తి గంగాధర్, బంటు రాజేశ్వర్, రామడుగు బాలకిషన్, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

అల్ప్రాజోలం, క్లోరోహైడ్రేడ్ పట్టివేత

సుభాష్‌నగర్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కృత్రిమ కల్లు తయారీలో ఉపయోగిస్తున్న నిషేధిత మత్తు పదార్థం అల్ప్రాజోలం, క్లోరోహైడ్రేడ్‌ను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు జిల్లాలో పట్టుకున్నారు. శుక్రవారం ఉదయం నవీపేట మండలం నాడాపూర్ గ్రామంలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వెంకట్‌గౌడ్ ఇంట్లో సోదాలు చేయగా ఒకటిన్నర కేజీల అల్రాజోలం, ఒక కేజీ క్లోరోహైడ్రేడ్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ స్వప్న తెలిపారు. సమాచారం మేరకు ఉదయం వెంకట్‌గౌడ్ ఇంట్లో తనిఖీలు నిర్వహించామని ఇంటి లోపల కొంత మొత్తం, ట్రాలీ ఆటోలో కొంత మొత్తం అల్ప్రజోలం, క్లోరోహైడ్రేడ్ దొరికాయని తెలిపారు. వెంకట్‌గౌడ్‌ను విచారించగా జిల్లాలోని రుద్రూర్ మండల కేంద్రానికి చెందిన బొంబాయి రాజాగౌడ్ నుంచి వీటిని తీసుకువచ్చినట్లు తెలిపాడన్నారు. రాజాగౌడ్‌ను కూడా అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సీఐ స్వప్న తెలిపారు. స్వాధీనం చేసుకున్న అల్ప్రజోలం, క్లోరోహైడ్రేడ్ విలువ మార్కెట్‌లో సుమారు రూ.18 నుంచి రూ.20 లక్షల ఉంటుందన్నారు. ఈ తనిఖీల్లో ఎస్సై రాంకుమార్, హెడ్‌కానిస్టేబుల్ నారాయణరెడ్డి, సిబ్బంది భోజన్న, ఉత్తమ్, అమీద్ పాల్గొన్నారు.

గల్ఫ్‌లో ఇందల్వాయి యువకుడి మృతి

ఇందల్వాయి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన నీరడి భోజన్న (45) బతుకుదెరువు కోసం గల్ఫ్ వెళ్లి అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. శవాన్ని తొందరగా స్వదేశానికి రప్పించే విధంగా రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు కోరారు. ఇందల్వాయి మాజీ సర్పంచ్ బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

సుభాష్‌నగర్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సహాయ ఉపకరణాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మహిళా శిశు దివ్యాంగుల సంక్షేమ అధికారిని రసూల్‌బీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 15, 16వ తేదీలలో ఏదైనా ఒకరోజు ఆన్‌లైన్‌లో సమర్పించిన దరఖాస్తు ఫారంతో పాటు ఒరిజినల్, జిరాక్స్ ధ్రువపత్రాలతో జిల్లా సంక్షేమ కార్యాలయంలో రూమ్ నెంబర్ 27లో హాజరుకావాలన్నారు. సదరు దరఖాస్తులను జిల్లా కమిటీ పరిశీలించి అర్హతగల దివ్యాంగులను ఎంపిక చేసి జాబితాను 16వ తేదీన ఉన్నత కార్యాలయానికి పంపిస్తామన్నారు. వివరాల కోసం 08462-251690ను సంప్రదించాలన్నారు.

పంట రుణాలు పంపిణీ చేయాలి

(ఐదో పేజీ తరువాయి)

ఎక్కువ మంది దివ్యాంగులు సభ్యులుగా ఉన్న సంఘాలకు బ్యాంకులలో ఖాతాలు తెరిచేందుకు అనుమతి ఇవ్వాలన్నారు. వ్యవసాయ శాఖతో పాటు పశుసంవర్ధక, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ తదితర శాఖలతో సమన్వయం చేసుకొని ప్రభుత్వ పథకాల కింద ఎంపికైన లబ్ధిదారులకు సకాలంలో రుణాలు అందించి స్వయం ఉపాధికి చేయూతనివ్వాలని హితవు పలికారు. రుణాలు తీసుకున్నవారు యూనిట్లు స్థాపించారా లేదా అన్నది నిశితంగా పరిశీలించాలన్నారు. స్వయం సహాయక సంఘాలకు పూర్తిస్థాయిలో లింకేజీ రుణాలు పంపిణీ చేయాలని సబ్సిడీ రుణాల పంపిణీలో జాప్యం చేయవద్దని సూచించారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంత యువతకు స్వయం ఉపాధి కోర్సుల్లో అందిస్తున్న శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న వారికి యూనిట్ల స్థాపన కోసం రుణాలు అందించేందుకు చొరవ చూపాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అంకిత్, ఆర్‌బీఐ ఎల్‌డీవో రాములు, డీఆర్‌డీవో సాయాగౌడ్, లీడ్ బ్యాంక్ మేనేజర్ అశోక్ చౌహాన్, నాబార్డు ఏజీఎం ప్రవీణ్‌కుమార్, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా అకాడమీలో ప్రవేశాలకు ఎంపికలు

సుభాష్‌నగర్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలి, ఎల్‌బీ స్టేడియంలో నూతనంగా ఏర్పాటు చేసిన క్రీడా అకాడమిలకు ఎంపికలను నిర్వస్తున్నట్లు జిల్లా యువజన మరియు క్రీడల శాఖ అధికారి బి.పవన్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 సంవత్సరంలో ప్రవేశానికి హాకీ అకాడమి గచ్చిబౌలిలో బాలురు, బాలికల కోసం అథ్లెటిక్స్ అకాడమి గచ్చిబౌలిలో బాలురు, బాలికల కోసం, హ్యాండ్ బాల్ అకాడమి ఎల్‌బీ స్టేడియంలో బాలుర కొరకు, ఫుట్‌బాల్ అకాడమి ఎల్‌బీ స్టేడియం బాలుర కొరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ప్రవేశాల కొరకు ఈనెల 15, 16వ తేదీల్లో ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు పాఠశాలల్లో చదువుతున్న బోనాఫైడ్‌ను, జననధృవీకరణ పత్రాన్ని, ఆధార్‌కార్డు, రెసిడెన్షియల్ ప్రూఫ్, క్రీడా ధృవీకరణ పత్రాలు, పాస్‌పోర్ట్‌సైజ్ ఫోటోలతో హాజరుకావాలన్నారు. ఉదయం 7గంటల వరకు వివిధ అకాడమిలో పాల్గొనబోయే క్రీడాకారులు మైదానాల్లో ఉండాలన్నారు. వయస్సు 12-16 సంవత్సరాలు కలిగి ఉండాలన్నారు.

కోటగల్లి పాఠశాలలో వంద దాటిన అడ్మిషన్లు

సుభాష్‌నగర్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కోటగల్లి ప్రభుత్వ పాఠశాలలో 2025-26 విద్యాసంవత్సరానికి 105 అడ్మిషన్లు జరిగాయి. ఈనెల 10వ తరగతి వరకు కోటగల్లిలోని శంకర్‌భవన్ పాఠశాలలో వందకు పైగా అడ్మిషన్లు జరిగాయి. గతనెల 6 నుంచి 19వ తేదీ వరకు ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ఉపాధ్యాయులందరూ పాఠశాల ప్రాంతాలలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. బడిబాట కార్యక్రమం సత్ఫలితాలను ఇచ్చింది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి దాదాపు 105 మంది విద్యార్థులు కొత్తగా నమోదు అయ్యారు. ఇప్పటి వరకు పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 268కి చేరింది. ఇప్పటి వరకు 1 నుంచి 5వ తరగతిలో ప్రభుత్వ పాఠశాల నుంచి 23 మంది, ప్రైవేటు పాఠశాల నుంచి 79 మంది, అంగన్‌వాడి కేంద్రాల ద్వారా 10 మంది విద్యార్థులు ఇంగ్లీష్ మీడియంలో తమ పేర్లను నమోదు చేసుకోవడం జరిగిందని ప్రధానోపాధ్యాయుడు రామచందర్ గైక్వాడ్ తెలిపారు. ప్రతీరోజు 5 నుంచి 10 వరకు నూతన అడ్మిషన్లు వస్తున్నాయని తెలిపారు. ఒక్క 5వ తరగతిలోనే 78 మంది విద్యార్థులు ఉన్నారని విద్యార్థులకు తగినట్టుగా తరగతి గదులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో ప్రస్తుతం ఏబీ సెక్షన్‌లుగా విభజించి బోధిస్తున్నామన్నారు. తరగతి గదులు లేని కారణంగా వరండాలో తరగతులు నిర్వహించాల్సి వస్తుందన్నారు. ఎంత మంది వచ్చిన అడ్మిషన్లు తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. మౌలిక సదుపాయాల కొరకు అధికారులు దృష్టి సారించాలని కోరారు.

ఇంకుడు గుంతలో పడి మూడేళ్ల బాలుడి మృతి

సిరికొండ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మూడు చక్రాల సైకిల్‌పై ఆడుతూ ఇంకుడు గుంతలో పడి మూడేళ్ల బాలుడు మృతి చెందిన ఘటన జిల్లాలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లాలోని సిరికొండ మండలంలోని కులాస్‌పూర్ గ్రామానికి చెందిన కుత్త కుమ్మరి గంగసాయిలు, రాణి దంపతుల ఏకైక కుమారుడు రిత్విక్. తండ్రి గంగ సాయిలు బతుకుదెరువు కోసం గల్ఫ్ దేశం వెళ్లాడు. దీంతో రాణి తల్లి గారిల్లు అయిన అదే మండలంలోని కొండాపూర్ గ్రామంలో కుమారుడితో జీవనం సాగిస్తున్నది. శుక్రవారం రిత్విక్ ఇంటి బయట మూడు చక్రాల సైకిల్‌పై ఆడుకుంటున్నాడని తల్లి రాణి ఇంటి పనుల్లో నిమగ్నమైంది. రిత్విక్ ఆడుకుంటూ కొద్ది దూరంలో ఉన్న ఇంకుడు గుంతలో పడిపోయాడు. కుమారుడి కోసం తల్లి వెతుకుతుండగా ఇంకుడు గుంత వద్ద సైకిల్ కనిపించగా అక్కడికి వెళ్లేసరికి గుంతలో పడి ఉన్నాడు. గుంతలో నుంచి కొన ఊపిరితో ఉన్న బాలుడిని తీసి చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించింది. వైద్యులు బాలుడిని పరీక్షించి చనిపోయాడని చెప్పారు. విషయాన్ని తెలుసుకున్న సిరికొండ ఎస్సై రామకృష్ణ నిజామాబాద్ ఆస్పత్రికి చేరుకున్నాడు. తల్లి రాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అక్కడే పోస్టుమార్టం కోసం పంపించారు.



రుత్విక్ (ఫైల్)

చికెన్ ధరలు

రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.220	రూ.270	రూ. 290
వెన్‌కాబ్(కిలో)	: రూ.230	రూ.280	రూ. 300

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.98,800	రూ.91,200	రూ.1120

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : ఓహో బ్రహ్మ అయ్యో రామా (11.05)
: సూపర్ మ్యాన్ (3డి తెలుగు) (2.15, 7.55, 10.45)
: జురాసిక్ వరల్డ్ (ఇంగ్లీష్) (5.05)
స్క్రీన్-2 : సూపర్ మ్యాన్ (3డి తెలుగు) (10.00)
: మాలిక్ (హిందీ) (12.50) : కుబేరా (4.00)
: ఓహో బ్రహ్మ అయ్యో రామా (7.40)
: జురాసిక్ వరల్డ్ (ఇంగ్లీష్) (10.50)
స్క్రీన్-3 : మాలిక్ (హిందీ) (10.45, 10.45)
: దీర్ఘాయుష్మాన్‌భవ (1.55) : వర్జిన్ బాయ్స్ (4.40)
: ఎఫ్-1 ది మూవీ (ఇంగ్లీష్) (7.30)
స్క్రీన్-4 : జురాసిక్ వరల్డ్ (తెలుగు) (10.40)
: ఎఫ్-1 ది మూవీ (ఇంగ్లీష్) (1.30) : 3బిహెచ్‌కె (4.45) : మాలిక్ (హిందీ) (7.40) : ది 100 (10.50)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : మిరపకాయ (11.00)
: కుబేరా (1.40, 7.25)
: ది 100 (4.45)
: వర్జిన్ బాయ్స్ (10.30)
స్క్రీన్-2 : సూపర్ మ్యాన్ (తెలుగు 3డి) (11.00, 1.40, 7.30, 10.20)
: జురాసిక్ వరల్డ్ (తెలుగు 3డి) (4.40)
స్క్రీన్-3 : ఓహో బ్రహ్మ అయ్యో రామా (11.00, 7.30)
: ది 100 (1.40)
: కుబేరా (4.25, 10.20)

దేవి: ఓహో బ్రహ్మ అయ్యో రామా (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : కుబేరా (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : సూపర్ మ్యాన్ (తెలుగు) (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహల్: తమ్ముడు (11.15, 2.15, 6.15, 9.15)

– నిజామాబాద్ అర్బన్